క్లుప్తంగా

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

పాయకాపురం(విజయవాడరూరల్): భార్యను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిర్యాది వాంబే కాలనీ హెచ్ బ్లాక్‌కి చెందిన మాలే స్వాతి. ఆమెకు మహేష్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. పెళ్లి నాటి నుంచి మహేష్ పని చేయకుండా మద్యం సేవించి భార్యను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

క్రీస్తు ఆరాధన కూడికలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవునికి హృదయంలో స్థానం ఇవ్వడం ద్వారా పరలోకంలో మన ఫలం అధికమవుతుందని ఆలిండియా బీసీటీసీ జనరల్ సెక్రటరీ రెవరెండ్ మంగలపూడి జోసెఫ్ అన్నారు. అజిత్‌సింగ్ నగర్ లూనా సెంటర్‌లో గిద్యోను ప్రార్థనా మందిరంలో 21వ క్రీస్తు ఆరాధన కూడిక సోమవారం పాస్టర్ నందిగం అజయ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బైబిల్‌లోని పలు విషయాలను వివరించారు. ప్రసంగికులు కలపాల జాషువా బైబిల్‌లో పొందుపరిచిన అనేక విషయాలు క్రైస్తవ సహోదరులకు తెలియజేశారు. మణిబాబు, ప్రభు భూషణం పాడిన పాటలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఎస్.ఇర్మీయా, దొండపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థల విక్రయం పేరిట మోసంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తక్కువ ఖర్చులో స్థలం ఉందని నమ్మబలికి అడ్వాన్సుగా రూ.4.05 లక్షలు మోసం చేశారంటూ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నందమూరినగర్‌కు చెందిన ఎం.శ్రీలక్ష్మి దంపతులు కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం వద్దకు యలవర్తి అంజలి అనే ఆమె తరచూ వచ్చి నున్న సమీపంలో తక్కువ ధరకు స్థలం ఉందని నమ్మబలికింది. స్థలం ఇప్పిస్తానని అడ్వాన్సుగా రూ.4.05 లక్షలు తీసుకున్నారు. ఈ క్రమంలో శంకరరావు అనే వ్యక్తిని తీసుకువచ్చి అతను ఎంఎస్ఆర్ డెవలపర్ రియల్‌ఎస్టేట్‌లో పార్టనర్ అని పరిచయం చేసింది. ఎంఎస్ఆర్ డెవలపర్ పేరిట రశీదు ఇచ్చి తగ్గిన మొత్తం ఇచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ చేయిస్తామంటూ చెప్పారు. తగ్గిన నగదు పోగుచేసుకున్న తరువాత లక్ష్మి అంజలికి ఫోన్ చేయగా నంబరు పనిచేయలేదు. దీంతో సదరు రియల్‌ఎస్టేట్ కార్యాలయంకు వెళ్లి అడగగా తమ వద్ద అంజలి అనే పేరుతో ఎవరూ పనిచేయడం లేదని.. దొంగ రశీదులు ఇచ్చి మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో బాధితులు అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాత్కాలిక, సాధారణ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యూనియన్ బ్యాంక్‌లో గత దశాబ్ద కాలంగా పని చేస్తున్న తాత్కాలిక, సాధారణ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాత్కాలిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ధర్నాకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు తాత్కాలిక, సాధారణ ఉద్యోగులు, బెఫి, ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

స్మృతివనంలో ముస్లింలను అడ్డుకున్న పోలీసులు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంబేడ్కర్ జయంతి సందర్భంగా నగరంలోని అంబేడ్కర్ స్మృతివనం వద్ద నివాళులర్పించేందుకు వచ్చిన ముస్లిం లీగ్ నేతలను సూర్యారావు పేట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రెండు గంటలకు పైగా స్టేషన్‌లో నిర్బంధించి అనంతరం విడిచిపెట్టారు. ముస్లిం లీగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాజావలి, ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు ముస్తాఫా, ఆమ్ ఆద్మీపార్టీ నేత నేతి ఉమామహేశ్వరరావు మరి కొందరు 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించడంతోపాటు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడేందుకు ప్రయత్నించగా సూర్యారావు పేట పోలీసులు వారిని అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా నిరసన తెలిపి వెళ్లి పోతామని చెప్పినప్పటికీ వినకుండా వారిని అక్కడ నుంచి స్టేషన్‌కు తరలించి రెండు గంటల పాటు స్టేషన్‌లో ఉంచారు. ముస్లిం లీగ్ అధ్యక్షుడు బషీర్ అహ్మద్ పోలీసులతో మాట్లాడిన రెండు గంటల తర్వాత వారిని వదిలిపెట్టారు. తమను అడ్డుకోవడంపై ముస్లిం లీగ్ నేతలు ప్రశ్నించారు. తమ పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడారని ఖాజావలి, నేతి ఉమామహేశ్వరరావు, ముస్తాఫా మీడియాకు తెలిపారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



24వ డివిజన్ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది



కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ సంస్థల ప్రతినిధులు



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్ ఆదర్శాలు, ఆశయాలు, ఆలోచనలు దేశానికి విశిష్ట వారసత్వ సంపద అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సోమవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కలెక్టర్, డీఆర్వో మహనీయుల చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం, అయోధ్యనగర్‌లో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుండె సుందర్‌పాల్ పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేడు సమాజంలో అణగారిన వర్గాలు సైతం సమాన హక్కులు అనుభవిస్తున్నారంటే అది అంబేడ్కర్ ముందు చూపు ఫలితమే అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఒగ్గు గవస్కర్, శ్యాంబాబు, పొలిమెట్ల శరత్, యాకోబు, అబ్రహం, రాబర్ట్, రాజు, త్రివేణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో..
స్థానిక 33వ డివిజన్ సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లెనిన్ సెంటర్‌లోని డా.బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. అంబేడ్కర్ విగ్రహాన్ని పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చేసిన సేవలను గుర్తు చేశారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ తదితర అంశాల్లో వసతి గృహ విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ లక్ష్మీశ ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శ్రీనివాస శిరోమణి, డీఎంహెచ్‌వో డా.ఎం.సుహాసిని, డీఏవో డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ఎంఐపీ పీడీ పి.ఎం.సుభానీ, డీఎస్‌వో పాపారావు, డీపీవో పి.లావణ్య కుమారి, దళిత నేతలు పాల్గొన్నారు.

విజయవాడ కల్చరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో సోమవారం అంబేడ్కర్ జయంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, చింతకాయల చిట్టిబాబు, ఆదిరాల జయప్రభు, జోషి, బి.వి.వీరభద్రరావు, వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.



బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో..



శాంతినగర్‌లో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు సుందర్‌పాల్, తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి మాట్లాడుతూ అంబేడ్కర్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. గ్రేడ్–2 గ్రంథ పాలకురాలు జి.ఉమారాణి, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో..
గాంధీనగర్‌లోని ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, వైఎస్సార్‌సీపీ ఆర్టిసన్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, వల్లపు లక్ష్మీనారాయణ, డేరంగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కార్యాలయంలో..

సామాజిక న్యాయ శిల్పానికి నివాళులు..

స్వరాజ్ మైదానంలోని స్మృతి వనంలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.చైతన్య, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్‌సింగ్‌నగర్ ఎమ్మెల్సీ కార్యాలయంలో సోమవారం 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీన సుల్తాన హఫీజుల్లా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం అంబేడ్కర్ జీవితం
మధురానగర్(విజయవాడసెంట్రల్): అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం అని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయ కర్త మల్లాది విష్ణు కొనియాడారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనం, 24వ డివిజన్, అజిత్‌సింగ్‌నగర్ స్మైల్ ఆసుపత్రి సమీపంలో సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు ఎం.డి.షాహినా సుల్తానా హఫీజుల్లా, కొండాయగుంట మల్లేశ్వరి, కుక్కల అనిత రమేష్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్టీఎస్ రోడ్డులో..
బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో డాక్టర్ బ్రహ్మదేశం వాకర్స్‌క్లబ్, హెల్పింగ్ టుగెదర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బి.సవంతకుమార్, కోరంగి నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాచవరంలో..
మాచవరంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. రిటైర్డ్ ఆర్ఐఓ ఎం.రాజారావు, ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ నాయకులు కటికల క్రిష్టోఫర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..
ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె భాగ్యలక్ష్మి అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అమరావతి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..
గులాబీతోట అమరావతి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలలో వాకర్స్ క్లబ్ ఫాస్ట్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మహనీయుడి విగ్రహానికి నివాళులర్పించారు.

పాయకాపురం(విజయవాడరూరల్): అంబేడ్కర్ ఆశయాలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పరిపాలన చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా అన్నారు. సోమవారం కండ్రికలో జరిగిన కార్యక్రమంలో ఆయన అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మౌలానా షేక్ సాజిద్, నగర అధ్యక్షులు సిలార్ బేగ్, యూత్ అధ్యక్షులు షేక్ నాగూర్, డివిజన్ నాయకులు పాల్గొన్నారు. రాజీవ్‌నగర్లో అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం..

విజయవాడస్పోర్ట్స్: అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే అన్నారు. ఎన్టీఆర్ జిల్లా టాన్స్‌పోర్ట్ కార్యాలయం వద్ద ఏపీ రవాణా శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రవాణా శాఖ అదనపు కమిషనర్ రమ్యశ్రీ, జాయింట్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్లు జి.సి.రాజారత్నం, ఇ.మీరాప్రసాద్, ఎం.పురేంద్ర, ఎన్టీఆర్ జిల్లా డీటీసీ ఎ.మోహన్, టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి జగదీష్, ఏపీ రవాణా శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ఆర్.సురేష్(డీటీవో, రాజమండ్రి), డి.ఎస్.ఎస్.నాయక్(ఎంవీఐ, తాడేపల్లిగూడెం), పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కె.వి.సుబ్బారావు, జె.రాజారావు పాల్గొన్నారు.

శాప్ కార్యాలయంలో..
ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) కార్యాయలంలో జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు. మహనీయులు అంబేడ్కర్ దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.



ఎస్ఆర్ఆర్ కాలేజీలోని వేడుకల్లో యువజన సర్వీసుల శాఖ సీఈవో శ్రీనివాసరావు

యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో..
ఉమ్మడి కృష్ణా జిల్లా యువజన సర్వీసుల శాఖ, వాకర్స్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ సీవీఆర్ కళాశాలలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ సీఈవో యు.శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. రిటైర్డ్ ఆర్ఐవో ఎం.రాజారావు, కాలేజీ ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ డి.యుగేందర్, వాకర్స్ సంఘం అధ్యక్షకార్యదర్శులు నాగరాజు, సుబ్బారావు, యువజన సర్వీసుల శాఖ అధికారులు రాఘవులు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహనీయుడి సేవలు అనిర్వచనీయం..



వీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తదితరులు



కార్యక్రమంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): అంబేడ్కర్ సేవలు అనిర్వచనీయమని విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఆయన జయంతిని నిర్వహించారు. తన జీవితాన్ని సామాజిక సమానత్వానికి అంకితం చేసిన మహానుభావుడు అంబేడ్కర్ అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యం, కార్పొరేటర్ చైతన్య రెడ్డి, అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని విజయవాడ నగరపాలక సంస్థ మినిస్టీరియల్ – ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి వేడుకల్లో వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహనీయుడి సేవలను ఆయన స్మరించుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ గోపాల్ నాయక్, వెటర్నరీ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, మేనేజర్ ఎ.యు.బి.శర్మ, సి సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీహరి కృష్ణ, పి.ఎస్.భగవాన్, అసోసియేషన్ ప్రెసిడెంట్ దారా రాంబాబు, జనరల్ సెక్రెటరీ ఎస్వీఎస్ చలం, చీఫ్ అడ్వైజర్ వి.ఎం.వి.రమణారెడ్డి, జాయింట్ సెక్రెటరీ తుపాకుల ప్రతాప్, ట్రెజరర్ సదల నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.వి.ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ గుర్రం వెంకటేశ్వరరావు, ఎల్.శివనాగ కిరణ్, వి.గోపాలకృష్ణ, బి.రాజేంద్ర చేతన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. హనుమాన్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ సమస్య, యువత ముందున్న సవాళ్లు అనే అంశంపై సోమవారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ హామీలు అమలు కాలేదన్నారు. నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఎక్కడ అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్, ఎన్నికల ముందు చంద్రబాబు నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తామని ప్రకటించారన్నారు. కానీ ఇచ్చిన హామీ ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్, నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న జి.కోటేశ్వరరావు

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి
మే 15 నుంచి తిరుపతిలో జరగనున్న ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. సదస్సులో నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, సహాయ కార్యదర్శి సింగంశెట్టి మోహన్‌ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మందగల్ల సాయికుమార్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం సాధ్యమని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో ఆపరేటివ్ న్యాంక్స్(నాఫ్ క్యాబ్) డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. కార్మిక వర్గాల మధ్య పాలకులు, రాజకీయ పార్టీలు, కార్పొరేట్ శక్తులు చిచ్చుపెట్టి స్వార్థ ప్రయోజనాల కోసం చీలికలు తెచ్చే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో ఏపీ సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సంఘం వజ్రోత్సవ వేడుకలు రెండో రోజు సోమవారం ముగిశాయి.

సహకార చట్టాన్ని కాపాడుకోవాలి..
ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. కేంద్ర పాలకుల నిరంకుశ విధానాల వల్ల సహకార బ్యాంకులు పరిస్థితి అగమ్య గోచరంగా ఉందన్నారు. కార్పొరేట్ వర్గాలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేందుకే కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు భారీగా తగ్గిస్తోందని చెప్పారు. నేడు సహకార బ్యాంకులు గొప్పగా అభివృద్ధి జరగడంలో సంఘం, సంఘం నాయకుల 60 ఏళ్ల కృషి ఉందన్నారు. 1904లో వచ్చిన సహకార చట్టం మన అందరిదని, దానిని కాపాడుకునే బాధ్యత మన పైనే ఉందని చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సహకార బ్యాంకుల సిబ్బంది అలవర్చుకోవాలని విశ్రాంత ప్రభుత్వ అధికారి డి.చక్రపాణి అన్నారు. సంఘం జాతీయ అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి కె.వి.ఎస్.రవికుమార్, సంఘం ప్రతినిధులు వెలుగురి రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎ.అంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాఫ్ క్యాబ్ డైరెక్టర్ రాఘవేంద్రరావు

గుండెపోటుతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన గవర్నర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నీలకంఠ ఆనంద్(45) అనే వ్యక్తి తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద రోడ్డుపక్కన భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం అతనికి గుండెపోటు రాగా చుట్టుపక్కల వారు గుర్తించి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. కాగా ఆయన మార్గమధ్యలో మృతి చెందాడు. దీనిపై గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వ్యక్తి వివరాలు తెలిసిన వారు 0866 2576023 నంబరులో తెలియజేయాలని పోలీసులు కోరారు.

● విద్యుత్ వెలుగులో అంబేడ్కర్ స్మృతివనం



భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నగర వ్యాప్తంగా సోమవారం అట్టహాసంగా జరిగాయి. అంబేడ్కర్ విగ్రహాలతో పాటు చిత్రపటాల వద్ద నగర వాసులు, నాయకులు ఘన నివాళులర్పించారు. వేడుకల్లో భాగంగా అంబేడ్కర్ స్మృతివనం విద్యుత్ వెలుగుల్లో మెరిసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా కమిటీ ఎన్నిక



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): లయన్స్ క్లబ్స్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించి, గుర్తింపు తీసుకురావాలని లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లోని ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్(అమ్మ) హాలులో లయన్స్ ఇంటర్నేషనల్ (డిస్ట్రిక్-316)డి స్పందన పేరుతో 27వ వార్షిక కన్వెన్షన్ ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. శేషగిరి ఆధ్వర్యంలో లయన్స్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ జరిగింది. లయన్స్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్‌గా వీవీపీఎస్ ఆంజనేయులు, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎలెక్ట్ ఎన్వీ ప్రసాద్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎలెక్ట్ చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరు త్వరలోనే అమెరికాలో జరిగే కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. క్లబ్ పాస్ట్ గవర్నర్లు మిరియాల వెంకటేశ్వరరావు, శ్రీశాంతి, క్లబ్ సభ్యులు శంకర గుప్తా, సుంకర కృష్ణ, జిల్లాలోని వివిధ క్లబ్స్ సభ్యులు ఎన్నికైన సభ్యులను అభినందించారు.